సాక్షి
జోగులాంబ గద్వాల

శనివారం । 3 । జూన్ । 2023



పుణ్యక్షేత్రాల్లో వేడుకలు

పుణ్యక్షేత్రాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸



పర్యాటకులతో సందడి

4 శతాబ్దాల క్రితం నిర్మించిన వంతెన ఇప్పుడు పర్యాటకులతో సందడిగా మారింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.9 /25.6

ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

అన్ని రంగాల్లో అభివృద్ధి

తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతలతో బీడుభూములు సస్యశ్యామలం

- జిల్లాలో **30.16శాతం** సాగు విస్తీర్ణం పెంపు
- జిల్లా **ఆస్పత్రి**, **అలంపూర్** వంద పడకల **ఆస్పత్రితో** మెరుగైన వైద్యం చేరువ
- రూ.వంద **కోట్లతో** నాలుగు మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు
- ఉజ్వల భవిష్యత్‌కు పకడ్బందీ ప్రణాళికలు
- రాష్ట్ర అవతరణ దినోత్సవాల్లో శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు

గద్వాల రూరల్: తొమ్మిదేళ్లలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, ప్రధానంగా సాగునీరు, వ్యవసాయంపై దృష్టి సారించామని.. వాటి ఫలితంగానే 30.16 శాతం పంటల విస్తీర్ణం పెరిగిందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా గడచిన తొమ్మిదేళ్ల కాలంలో జిల్లాలో వివిధ శాఖల పరంగా చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

రైతుబంధుతో భరోసా..

2019–20 నుంచి ప్రవేశపెట్టిన రైతు బంధు పథకం ద్వారా పది విడతలుగా ఎకరాకు రూ.5వేల చొప్పున జిల్లాలో 1,60,799మంది రైతులకు రూ.1,924.61కోట్లు అందజేశాం. అదేవిధంగా రైతుబీమా ద్వారా జిల్లాలో చనిపోయిన 2,572మంది రైతుల కుటుంబాలకు రూ.128.60కోట్లు ఇచ్చామని వివరించారు. ఇక జిల్లాలో 2014–15లో రెండు సీజన్లు కలిపి మొత్తం పంటల విస్తీర్ణం 4,27,397 ఎకరాలు ఉండగా.. 2022–23 నాటికి రెండు సీజన్లు కలిపి 5,56,335 ఎకరాలకు పెరిగిందన్నారు. అంటే గడచిన తొమ్మిదేళ్లలో 30.16శాతం మేర పంటల సాగు విస్తీర్ణం పెరగడం గమనార్హమన్నారు.

రూ.1,270 కోట్లతో తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతలు

ఆర్డీఎస్ కింద సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న 55,600 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు రూ.783కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇందులో మొదటి దశలో రూ.397కోట్లతో పనులు ప్రారంభించి రూ.159కోట్ల పనులను పూర్తి చేశామని, దీనిద్వారా మొదటి పంపు ద్వారా 2018లో ఆర్డీఎస్ ఆయకట్టుకు నీరందించినట్లు తెలిపారు. ఇక గట్టు, కె.టి.దొడ్డి మండలాల్లోని 33వేల ఎకరాల బీడుభూములకు సాగునీరు అందించే లక్ష్యంతో రూ.487.03కోట్లతో గట్టు ఎత్తిపోతల పథకాన్ని మొదలు పెట్టినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తిచేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



‘తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడే పరిస్థితిలో ప్రత్యేక తెలంగాణ ఏర్పడింది. అనతి కాలంలోనే సమస్యల వలయం నుంచి బయట పడడమే కాకుండా.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ నిరంతర ప్రగతిశీల రాష్ట్రంగా నిలిచింది. యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. బంగారు తెలంగాణ నిర్మాణం దిశగా తొమ్మిదేళ్లలో బలమైన అడుగులు వేశాం. జిల్లాలో తుమ్మిళ్ల, గట్టు ఎత్తిపోతలతో బీడు భూములు సస్యశ్యామలమయ్యాయి. సాగు విస్తీర్ణం పెరిగింది. పేదలకు కార్పొరేట్ వైద్యం అందేలా జిల్లా ఆస్పత్రి.. అలంపూర్ ఆస్పత్రులు నిర్మిస్తున్నాం. అన్ని రంగాల్లో జిల్లాను అభివృద్ధి పరుస్తూ.. ఉజ్వల భవిష్యత్‌కు పకడ్బందీ ప్రణాళికలతో ముందుడు వేస్తున్నాం.’

– టి.పద్మారావు, శాసన సభ డిప్యూటీ స్పీకర్



జిల్లా కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు

నీటిపారుదల శాఖ

మిషన్ కాకతీయ ద్వారా జిల్లాలో

గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలలోని 8మండలాల్లో రూ.45.06కోట్లతో 345చెరువులను పునరుద్ధరణ చేపట్టినట్లు తెలిపారు. ఇందులో 262 చెరువు పనులు పూర్తి కాగా మిగిలిన పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఇవి పూర్తయితే వీటి కింద 16,909ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందన్నారు.

మిషన్‌భగీరథ

జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి సురక్షిత తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకం అమలు చేసిందన్నారు. దీని ద్వారా జిల్లాలోని 319గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రూ.209కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.508కోట్లతో తాగునీటిని అందించేందుకు అవసరమైన పైపులైన్లు, ఓహెచ్‌బీఆర్, డబ్ల్యుటీపీ, జీఎల్‌బీఆర్ సంపుల నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు.



విద్యార్థుల నృత్యప్రదర్శన



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

పశుసంవర్ధక శాఖ

జిల్లాలో కురవ, గొల్లలకు రూ.165.96కోట్లతో గొర్రెల పథకం కింద 13,277 మంది లబ్ధిదారులకు యూనిట్లు అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా 2023–24 సంవత్సరానికిగాను మరో 9442యూనిట్స్ మంజూరీ రూ.165.23 ప్రతిపాదనలు పంపించామని వివరించారు. అదేవిధంగా సి-లిస్టు ద్వారా 33,416మంది లబ్ధిదారులను గుర్తించి వారికి కూడా గొర్రెలు అందించేలా అవసరమైన ప్రతిపాదనలు పంపించామని అన్నారు.

- మత్స్యకారులకు 2015–16 నుంచి 2022–23 వరకు వందశాతం సబ్సిడీతో రూ.5.95 కోట్ల విలువగల చేపపిల్లలను అందజేశాం.
- మొత్తం 72,501మంది లబ్ధిదారులకు ఆసరా పథకం ద్వారా ప్రతినెలా రూ.16.98కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు.
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక మునుపు 262సంఘాలు ఉంటే ప్రస్తుతం వాటిని 6653సంఘాలకు పెంచినట్లు తెలిపారు. దీనిద్వారా ప్రభుత్వం అందించే రుణాల ద్వారా 74,002మంది లబ్ధి చేకురుతుందన్నారు. అదేవిధంగా బ్యాంకు లింకేజి ద్వారా జిల్లాలో 2014–15నుంచి 2022–23వరకు రూ.8.65కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు.
- హరితహారం పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలో 137.09లక్షల మొక్కలు నాటామన్నారు.
- జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో వంద మంది లబ్ధిదారుల చొప్పున రెండు వందల మందికి ఒక్కొక్కరికి రూ.10లక్షల విలువ గల లబ్ధిదారులు కోరిన యూనిట్లు ఇప్పించాం.
- 333చౌకధర దుకాణాల నుంచి ప్రతినెలా 1,60,251మంది లబ్ధిదారులకు 3,48,545టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉజ్వల పథకం ద్వారా ఇప్పటి వరకు 31,313 గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు.
- గద్వాల మున్సిపాలిటీ సీఎం ప్రత్యేక నిధి కింద మున్సిపాలిటీలో రూ.56కోట్ల విలువైన వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఇందులో కొన్ని పూర్తికాగా మరికొన్ని వివిధ దశలలో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇక అయిజ, వడ్డేపల్లి, అలంపూర్ మున్సిపాలిటీల పరిధిలో రూ.40కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.
- కళ్యాణలక్ష్మి పథకం కింద 18,558మంది లబ్ధిదారులకు రూ.117.91కోట్లు, షాదీముభారక్ ద్వారా 2164మంది లబ్ధిదారులకు రూ.19.92కోట్లు అందజేసినట్లు తెలిపారు.
- ఐదు చేనేత సహకార సంఘాలకు ఇప్పటి వరకు రూ.59.27లక్షలు పావలా వడ్డీ రుణాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే, 40శాతం రాయితీ ద్వారా 6234మందికి నూలు అందజేశామని, ఇందుకోసం రూ.10.11కోట్లు డీబీటీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాలో జమచేసినట్లు తెలిపారు.

మెరుగైన వైద్యం చేరువ..

రూ.26.18కోట్లతో నూతనంగా నర్సింగ్ కళాశాల మంజూరైందని, 2021 డిసెంబర్ 22న అడ్మిషన్లు మొదలు పెట్టామని మొదటివిడతలో 91మంది విద్యార్థులు, రెండవ విడతలో 97మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అలంపూర్‌లో రూ.21కోట్లతో వంద పడకల ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు పనులు పురోగతిలో ఉన్నాయని త్వరలోనే ప్రజలకు వైద్యసేవలందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అయిజ పీహెచ్‌సీలో రూ.79లక్షలతో 30పడకల ఆస్పత్రిగా పెంచేలా అవసరమైన పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ.39.79కోట్లతో చేపట్టిన జిల్లా ఆస్పత్రి పనులు పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. కంటివెలుగు ద్వారా మొదటి విడతలో 2,83,216 మందికి, రెండవ విడతలో 2,63,320 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. అదేవిధంగా జిల్లాలో ఇప్పటి వరకు 9,792మంది బాలింతలకు కేసీఆర్ కిట్లు అందజేశామని పద్మారావు వివరించారు.

తెలంగాణ సంబరం..



కలెక్టరేట్ వద్ద జెండా వందనం చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్/గద్వాల/గద్వాల క్రైం/ఎర్రవల్లిచౌరస్తా: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లాలో ఆవిర్భావ దినోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని జెడ్పీచైర్‌పర్సన్ సరిత ఆవిష్కరించారు. సమైక్యాంధ్ర పాలనలో ఆగమైన రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చుకునేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

- కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, కలెక్టరేట్ ఏవో యాదగిరి, సూపరింటెండెంట్లు రాజు, మదన్‌మోహన్, వరలక్ష్మి, యల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.
- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సృజన జెండా ఎగురవేశారు. ఎన్నో పోరాటాలు, ఎందరో విద్యార్థులు, ఉద్యమకారులు, ఆత్మబలిదానాలు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని, వారి ఆశయసాధనకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు.
- ఆరు దశాబ్దాల పోరాటంతో సాధించుకున్న తెలంగాణ నేడు సంతోషాలతో విరాజిల్లుతుందని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అన్నారు. ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఎంపీపీ స్నేహ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించగా.. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జెడ్పీచైర్‌పర్సన్ సరిత, జడ్పీ మాజీ చైర్మన్ బండారి బాస్కర్, మందా శ్రీనాథ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే..



శాంతినగర్: యువకుల ఆత్మ బలిదానాలను చూడలేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది సోనియా గాంధీ అని, 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ఏ విధంగానూ అభివృద్ధి చెందలేదని కేవలం భౌగోళికంగా మాత్రమే అభివృద్ధి చెందినట్లు చూయిస్తున్నారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే నీళ్లు, నిధులు, ఉద్యోగాలు వస్తాయని భావించిన వారికి నిరాశే మిగిలిందన్నారు. కుటుంబ పాలనతో కేసీఆర్ ఇంటికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయలేదన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకు సోనియా గాంధీ తెలంగాణ ఇస్తే కేసీఆర్ కుటుంబం ప్రజలను భ్రష్టు పట్టించారన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదరించేంది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు.

రాష్ట్రంలో కుటుంబపాలన

ధరూరు: ఎన్నో ఆశలు, ఆశయాలతో కొట్లాడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రం కేసీఆర్ కుటుంబానికి తప్ప ఏ ఒక్కరికీ ఉపయోగపడలేదని, ఏళ్లుగా కుటుంబపాలన నడుస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, టీపీసీ ప్రతినిధి శంకర్ అన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ధరూరులోని వైఎస్సార్ చౌరస్తాలో సోనియా గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నల్లా రెడ్డి, కోర్డినేటర్ షేక్ జమాల్, వీరుబాబు, మజీద్, రాజేంద్ర పాల్గొన్నారు.

మన్యంకొండలో ప్రసాదం కౌంటర్‌కు స్థల పరిశీలన



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం కౌంటర్ నిర్మాణం కోసం శుక్రవారం టూరిజం సీఈ వెంకటరమణ, డీఈఈ పర్షవేది గౌడ్, ఏఈ మధుసూదన్‌రెడ్డిలు స్థల పరిశీలన చేశారు. అదేవిధంగా స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులు దేవస్థానంలోని బయటకు వెళ్లేందుకు స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు లడ్డూ కౌంటర్, భక్తులు దేవాలయంలో నుంచి బయటకు వెళ్లే దారి కోసం స్థలాలను పరిశీలించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, రోప్‌వే ఎండీ బోస్ తదితరులు ఉన్నారు.

6న ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ ఎంపికలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన పాలమూరు యూనివర్సిటీ సమీపంలోని మిసా ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.రవికుమార్ శుక్రవారం తెలిపారు. అండర్–13, 15, 17, 19 విభాగాలతో పాటు సీనియర్ పురుషులు, మహిళలకు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 8 గంటలకు సాదత్‌ఖాన్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు. మిగతా వివరాల కోసం 9848085211, 9866928835 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,726

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగకు గరిష్టంగా రూ.6,726, కనిష్టంగా రూ.5,878 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,825, కనిష్టంగా రూ.1,401, ఆముదాలు గరిష్టంగా రూ.5,400, కనిష్టంగా రూ.5,199, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,689, కనిష్టంగా రూ.1,341, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,279, కనిష్టంగా రూ.1,629 ధరలు పలికాయి.

బీఆర్ఎస్‌ను గద్దె దింపడానికి ప్రజలు సిద్ధం

మల్లు భట్టి విక్రమార్క



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మల్లు భట్టి విక్రమార్క

అచ్చంపేట: ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు కొనసాగుతున్న పాదయాత్రలో ప్రజలు ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దె దింపడానికి ప్రజలు సిద్ధమైనట్లు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండల కేంద్రంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శిబిరం వద్ద తెలంగాణ లక్ష్యాలు సాధించిన ఫలితాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణం అంటే ఆనాడు ఉన్న అసమానతలు, ఆకలి చావులు, బాంచన్ దొర, అణచివేత, వెట్టిచాకిరిని తిరిగి పునర్నిర్మాణం చేయడమేనా అని ప్రశ్నించారు. ఉద్యమాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసిన భూములపై ఉన్న హక్కులను భూప్రక్షాళన పేరుతో తొలగించి ఉద్యమ లక్ష్యాలను వెనక్కి తీసుకెళ్లింది దేశంలో కేసీఆర్ ఒక్కడే అని విమర్శించారు. గత ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన భూములను పార్ట్ బీలో పెట్టి వాటిని తిరిగి దొరలకు ఇప్పించే పనిలో సీఎం కేసీఆర్ ఉన్నారని విమర్శించారు. రాష్ట్ర సాధన కోసం ఏర్పడినట్టుగానే తెలంగాణ సామాజిక నిర్మాణం కోసం నేడు జేఏసీలు ఏర్పడాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రం వచ్చి పదేళ్లు అవుతున్న సందర్భంగా కొట్లాడి కోరి తెచ్చుకున్న తెలంగాణ లక్ష్యాలు ఏంటి? ఇప్పటి వరకు సాధించిన ఫలితాలు.. అన్నదానిపై ప్రతి ఇంట్లో చర్చ చేయాలని, మేధావులు నియోజకవర్గ, మండలకేంద్రంలో సెమినార్లు నిర్వహించి ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు.

- పీపుల్స్ మార్చ్ పాదయాత్ర బోథ్ నియోజకవర్గం నుంచి పిప్పరి, అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలం వరకు 900 కిలోమీటర్లు పూర్తి చేసిన సందర్భంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోనియాగాంధీ చిత్రపటానికి మైలారం వద్ద పాలాభిషేకం చేశారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. శుక్రవారం పాదయాత్ర బల్మూర్ మండలం నర్సాయపల్లి, అనంతవరం, బల్మూర్, మైలారం, కొండనాగుల, రామాజిపల్లిగేట్, సీతారాంపూర్, రాంజీ గేట్‌వరకు కొనసాగింది.
- నిరంకుశ నియంతృతతో పరిపాలన సాగిస్తున్న కేసీఆర్‌ను గద్దె దింపడానికి క్షేత్రస్థాయిలో రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లురవి అన్నారు. రాష్ట్రంలో జీవించే హక్కు, మాట్లాడే స్వేచ్ఛ లేకుండా చేసి దశాబ్ది ఉత్సవాలు ఘనంగా చేసుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, గిరివర్ధన్‌గౌడు, రాంప్రసాద్‌గౌడ్, సుధాకర్‌గౌడు, జంగయ్య పాల్గొన్నారు.

పదేళ్లలోనే.. వందేళ్ల అభివృద్ధి



అలంపూర్ చౌరస్తాలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం

అలంపూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో పదేళ్ల కాలంలోనే వందేళ్ల అభివృద్ధికి సజీవ సాక్షిగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం హాజరై మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర సాధనలో ఎంతో మంది అమరులు ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలు ఎప్పటికి మరువలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవన్న, యువజన నాయకుడు డాక్టర్ అజయ్‌తోపాటు రమణ, నాగేశ్వర్ రెడ్డి, బీచుపల్లి, లోకేశ్వర్ రెడ్డి, నరసింహ, వెంకట్‌గౌడ్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

‘అమరవీరుల త్యాగాలు మరువలేనివి’



ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న బీచుపల్లి బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్

ఎర్రవల్లిచౌరస్తా: ఎందరో అమరవీరుల త్యాగఫలం వలనే మనమంతా ఈ రోజు స్వతంత్రంగా జీవిస్తున్నామని.. అలాంటి అమరవీరుల త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పదో బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్ అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధనలో చాలా మంది విద్యార్థులు, ఉద్యోగులు తమ ప్రాణాలను సైతం కోల్పోయారని, బంగారు తెలంగాణ కోసం వారు కన్న కళలను సాధించడంతో పాటు అమరుల ఆత్మకు శాంతి కలుగుటకు గాను ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు శాలువాతో సన్మానించి మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్, ఆర్ఐలు గోపాల్, రాజారావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

8న మంత్రి కేటీఆర్ రాక



వేముల ఎస్‌జీడీ ఫార్మా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: మూసాపేట మండలం వేముల శివారులోని ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ వద్దకు ఈనెల 8న మంత్రి కేటీఆర్ రానున్నారు. ప్రస్తుతం ఉన్న పరిశ్రమ వద్ద రూ.500 కోట్ల పెట్టుబడితో మరో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో మంత్రులు కేటీఆర్, వి.శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం ఎస్‌జీడీ ఫార్మా వద్ద ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఏర్పాట్ల గురించి పరిశ్రమ నిర్వాహకులతో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలోని యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే ఆల తెలిపారు. కొత్త పరిశ్రమతో మరి కొంత మంది స్థానిక యువతకు ఉపాధి లభించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

బస్టాండ్‌లో యాచకుడు మృతి

కోడేరు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బస్టాండ్‌లో యాచిస్తూ అక్కడే నిద్రించేవాడు. శుక్రవారం తెల్లవారుజామున సిమెంట్ కుర్చీపై పడుకున్న వ్యక్తి కొనప్రాణంతో కాళ్లు చేతులు కదిలిస్తూ కనిపించాడు. ఇంతలో బస్టాండ్‌లో శుభ్రం చేసేందుకు వచ్చిన పంచాయతీ కార్మికులు చూసి నోట్లో తాగునీరు పోశారు. కాగా అప్పటికే ఆయన మృతి చెందాడు. గ్రామస్తులు సంఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తి ఎవరూ అని ఆరా తీయగా పెంట్లవెల్లి మండలం చింతపల్లికి చెందిన రాములు(48) గుర్తించారు. బంధువులకు ఈ విషయంపై ఫోన్లో సమచారం ఇవ్వడంతో వారు చేరుకొని తమ వారేనని గుర్తించి సొంత గ్రామానికి తీసుకెళ్లారు. ఎస్‌ఐని వివరణ కోరగా రాములు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని మృతుని అన్న శ్రీను చెప్పారని, ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు.

ఆన్‌లైన్‌గేమింగ్‌తో అప్పుల పాలు..

- బలవన్మరణానికి పాల్పడిన ప్రభుత్వ టీచర్


పెద్ద దరెన్న (ఫైల్)

గద్వాల క్రైం: ఆర్థిక సమస్యలు తాళలేక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పట్టణంలోని గంజిపేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన పెద్ద దరెన్న (37) వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఆన్‌లైన్ గేమింగ్‌లో భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు. వీటి కోసం అప్పులు సైతం చేశాడు. అప్పులు తీర్చే క్రమంలో ఆర్థిక సమస్యలతో సతమతం అయ్యేవాడని స్థానికులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సాయంత్రం చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రోషిణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై పట్టణ ఎస్‌ఐ రామస్వామిని వివరణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అప్పుల బాధతో..


నర్సింహా (ఫైల్)

తెలకపల్లి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గట్టునెల్లికుదురు చెందిన పురం నర్సింహ (45) శుక్రవారం ఉదయం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఇంటి అవసరాల నిమిత్తం రూ.లక్షకు పైగా అప్పులు ఉన్నాయని వాటిని తీర్చే క్రమంలో ఇబ్బందులు పాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య చిట్టెమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరువులో మహిళ మృతదేహం లభ్యం


శివమ్మ (ఫైల్)

ఆత్మకూర్: చెరువులో మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన శుక్రవారం పట్టణంలో చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ జావిద్ తెలిపిన వివరాల ప్రకారం .. శుక్రవారం చెరువులో మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలం వద్దకు వెళ్లి పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పట్టణంలోని తెలుగుగేరికి చెందిన తెలుగు శివమ్మ(60) బుధవారం చెర్ల పరమేశ్వరస్వామి ఆలయంవద్ద పూజ చేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కాగా ఆమెకు మూర్ఛ వ్యాధి ఉందని ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండొచ్చని కుటుంబసభ్యులు తెలిపారు. ఈమెకు నలుగురు కూతుర్లు ఉండగా అందరికి వివాహాలు కాగా, ఇంట్లో భార్యాభర్త మాత్రమే ఉంటున్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జైలు శిక్ష, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో మొదటిసారి డ్రంకన్‌డ్రైవ్ కేసులో వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. పట్టణ ట్రాఫిక్ పోలీసులు చేసిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిర్మల ఐదుగురికి రూ.11,500 జరిమానా విధించగా మరో వాహనదారుడికి రూ.4వేల జరిమానాతో పాటు నాలుగు రోజుల జైలు శిక్ష, ఆరు నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. వాహనదారుడిని జిల్లా జైలుకు తరలించారు. ట్రాఫిక్ సీఐ అశోక్ మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, తమ జీవితాలతో పాటు ఎదుటివారి జీవితాలను ప్రమాదంలో వేయరాదన్నారు.


పాలమూరులో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు


నృత్యప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

అంబరాన్నంటిన సంబరాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లాలోని కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రొ.జయశంకర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాల వేశారు. అనంతరం ఉద్యమంలో పోరాడిన, అమరుల సేవలను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాలోని ప్రగతి నివేదికలను ప్రతినిధులు వివరించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్, మహబూబ్‌నగర్


అమరవీరుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్


'పేట'లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాకిటి సునీత




నాగర్‌కర్నూల్‌లో గిరిజన వేషధారణలో విద్యార్థుల నృత్య ప్రదర్శన


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అమరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి తదితరులు


వనపర్తిలో విద్యార్థులు యోగా ప్రదర్శన

తెలంగణతల్లి వేషధారణలో విద్యార్థిని


బోనం ఎత్తుకుని వస్తున్న విద్యార్థిని


గద్వాల కలెక్టరేట్‌లో..


సాంస్కృతిక నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న యువతి

విద్యుదాఘాతంతో దుకాణం దగ్ధం

కల్వకుర్తి టౌన్: విద్యుదాఘాతంతో కట్టెల దుకాణం పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, బాధితుడు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న కట్టెల దుకాణంలో యజమాని శివ ఉదయాన్నే పూజ నిర్వహించి వ్యక్తిగత పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. ఆ తర్వాత అకస్మాత్తుగా విద్యుదాఘాతంతో తడకలతో ఏర్పాటు చేసిన గుడిసెలో మంటలు చెలరేగాయి. మంటలు విస్తరించే సరికి అప్పటికే అందులో ఉన్న చిన్న సిలిండర్ పేలడంతో మంటలు మరింతగా వ్యాపించాయి. నివాసంలోని అన్ని వస్తువులతో పాటుగా బీరువాలో ఉన్న రూ.50 వేలు, అక్కడే ఉన్న 200 వరకు తడకలు, బైకు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదంలో సుమారుగా రూ.1.5లక్షల వరకు ఆస్తినష్టం సంభవించింది. ఫైర్‌ఇంజన్ వచ్చి మంటలను ఆర్పి ప్రమాదాన్ని కొంతవరకు నివారించారు.


కల్వకుర్తిలో పూర్తిగా దగ్ధమైన గుడిసె

తుమ్మలకుంటతండాలో గృహోపకరణాలు..

వెల్దండ: మండలంలోని తుమ్మలకుంటతండాలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. తండాకు చెందిన వార్డు సభ్యురాలు దేవి ఇంట్లో ఈదురుగాలులకు అధిక వోల్టేజి విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్, కూలర్, గృహ పరికరాలు కాలిపోయాయి.

వరిగడ్డి దగ్ధం

మల్దకల్: మండలంలోని దాసర్‌పల్లిలో శుక్రవారం విద్యుదాఘాతంతో రెండు వరిగడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతులు సవారన్న, ఆంజనేయులు పొలం వద్ద పశువుల కోసం వరిగడ్డి నిల్వ చేసుకున్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ తీగల నుంచి మంటలు చేలరేగి వరిగడ్డికి నిప్పంటుకుంది. దీంతో రూ.40 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు.

గడ్డివాము దగ్ధం

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో శుక్రవారం ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన చోటచేసుకుంది. గ్రామానికి చెందిన సోమయ్య గడ్డివాము మూగజీవాలకోసం తీసుకురాగా, ప్రమాదవశాత్తు దగ్ధమైంది.

ఆవిర్భావ వేడుకల్లో అపశ్రుతి

- జాతీయ జెండాను తొలగిస్తుండగా విద్యుదాఘాతం
- సపాయి కార్మికురాలు మృతి


రేణుక (ఫైల్)

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవంలో అపశృతి చోటు చేసుకుంది. ఉదయం ఎగరవేసిన జాతీయ జెండాను సాయంత్రం తొలగిస్తుండగా జెండా ఇనుపరాడ్ 11కేవీ విద్యుత్ వైర్లకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కేశంపేట రేణుక అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఇద్దరు సపాయి కార్మికులు బొల్లె చిట్టమ్మ, బిజినేపల్లి చిట్టెమ్మలకు షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త స్వామి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

యువతి అదృశ్యం

అడ్డాకుల: నిజాలాపూర్ గ్రామానికి చెందిన యువతి(19) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. గురువారం ఇంట్లో కుటుంబ సభ్యులందరూ పడుకున్న తర్వాత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. శుక్రవారం ఉదయం యువతి ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అంతటా వెతికినట్లు తెలిపారు. ఆమె సోదరుడు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తికి గాయాలు

భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. జడ్చర్లకు చెందిన బి.మల్లేష్ భూత్పూర్ పట్టణంలోని బ్రిడ్జి వద్ద నడుచుకుంటూ జడ్చర్ల బస్టాప్ వద్దకు వస్తున్న క్రమంలో నాగర్‌కర్నూల్ నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొంది. దీంతో మల్లేష్‌కు కాలుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు మల్లేష్‌ను చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో దూకబోయిన వివాహిత

- స్థానికులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్ తరలింపు

నాగర్‌కర్నూల్ క్రైం: కుటుంబకలహాలతో వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. జిల్లా కేంద్రంలోని 2వ వార్డుకు చెందిన ఎల్లమ్మ, భర్త పరశురాములకు ఆర్థిక ఇబ్బందులతో కలహాలు చోటు చేసుకున్నాయి. మనస్థాపానికి గురైన ఎల్లమ్మ కేసరి సముద్రం చెరువులో దూకేందుకు అక్కడికి వెళ్లింది. గమనించిన స్థానికులు ఆమెను అడ్డుకుని స్థానికులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

బ్యాంకు వద్దే నగదు చోరీ

మక్తల్: బ్యాంకు నుంచి బంగారం తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుని బయటికి రాగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని మాద్వార్ చెందిన సకిర మోళ్ల శంకరప్ప ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు పట్టణంలోని ఓ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.2.49 లక్షలు తీసుకున్నాడు. వాటిని ఓ సంచిలో పెట్టుకుని బయటకు వచ్చి ద్విచక్రవాహనంలో పెట్టి పక్కకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి డబ్బులు ఉన్న సంచి కనిపించలేదు. నగదుతో పాటు ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు, భూమి పాస్‌బుక్ అందులో ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రయాణికురాలి బంగారం, సెల్‌ఫోన్ అపహరణ

పెబ్బేరు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికురాలి వద్ద నుంచి బంగారం, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ జిల్లాకు చెందిన సురేఖ, పెంట్లవెల్లిలోని శుభకార్యానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుతున్న క్రమంలో పెబ్బేరు బస్టాండ్‌లో బస్సు దిగింది. కర్నూల్ బస్సు కోసం వేచిఉండగా గుర్తుతెలియని వ్యక్తులు మూడున్నర తులాల బంగారం, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

కుమారుడి మృతదేహం కోసం తల్లిదండ్రుల నిరీక్షణ


కప్పెటలో మహేష్ ఇంటి వద్ద కుటుంబ సభ్యులు

భూత్పూర్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కప్పెటకు చెందిన బోయ శకుంతల, వెంకట్రాములు దంపతుల పెద్ద కుమారుడు బోయ మహేష్ ఉన్నత చదువుల కోసం గతేడాది డిసెంబర్ చివరి వారంలో అమెరికా వెళ్లాడు. కాగా మే 24న రోడ్డు ప్రమాదంలో బోయ మహేష్ మృతి చెందాడు. వెళ్లిన 5 నెలలకే కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలను గ్రామస్తులను కలచివేసింది. మూడు రోజుల పాటు అమెరికాలో సెలవులు కావడంతో మృతదేహం రావడం ఆలస్యమైందని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి శనివారం రాత్రి వరకు కార్గో విమానంలో మృతదేహం శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టుకు వస్తుందని, మృతుడి తండ్రి వెంకట్రాములు తెలిపారు.

క్లుప్తంగా

కరపత్రాల విడుదల



అలంపూర్: దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం వ్యవసాయ శాఖ అధికారితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ సక్రియ నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు రమణ, బీచుపల్లి, ఉపాధ్యక్షుడు రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు సన్మానించారు. శుక్రవారం జెడ్పీ పాఠశాల నుంచి సమ్మర్ క్యాంపులోని సీఎం కప్‌లో రాష్ట్రస్థాయిల్లో వాలీబాల్ పోటీల్లో విద్యార్థి పరశురాముడు ఎంపిక కావడంతో వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శివ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు భూమిపూజ

మల్దకల్: మండలంలోని ఎల్కూరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శుక్రవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, సర్పంచు రాధ, నాయకులు చక్రధర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.95 వేల స్కాలర్‌షిప్

ఉండవెల్లి: మేధ చారిటబల్ ట్రస్ట్ వారు నిర్వహించిన పోటీ పరీక్షలో మెరిట్ సాధించిన మండలంలోని పుల్లూరు శివారులోని మహాత్మ జ్యోతి బాపులే గురుకుల విద్యార్థి పుష్పలతకు ఏడాదికి రూ.95 వేలు స్కాలర్‌షిప్‌ను అందిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దేవానందం శుక్రవారం తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

గద్వాల రూరల్: ప్రతిభావంతులైన పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులను ఉన్నత చదువులకు ప్రోత్సహించేందుకు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు విద్యా కమిటీ ద్వారా నిధిని ఏర్పాటు చేసి రూ.1లక్ష జమ చేసినట్లు విద్యా కమిటీ దాత ఆర్‌బీ వెంకటరమణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని రామ్‌నగర్‌లో టెన్త్, ఇంటర్మీయట్ విద్యార్థులకు అవసరమైన స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో నారాయణ, బుచ్చన్న, జయన్న, భగీరథ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ నారాయణ స్వామి కల్యాణం



రాజోళి: మండల కేంద్రంలోని చారిత్రాత్మక వైకుంఠ నారాయణ స్వామి కల్యాణం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి హంసవాహన సేవ, సర్వభూపాల సేవ చేపట్టారు.

పేస్కేల్ వర్తింప చేయాలి



గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్‌ను వర్తింప చేయాలంటూ గద్వాలలో దశాబ్ది ఉత్సవాలకు హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్రహం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి ఉపాధి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు.

ధరూరు: ఉపాధి కూలీలకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని మార్లబీడులో ఉపాధి కూలీలతో కలసి ఆందోళన వ్యక్తం చేశారు. దేవదాసు, సుందర్‌రాజు, ఆనంద్, మారెన్న, ఆశన్న, మల్లకల్, రత్నమ్మ, ప్రేమలీల, అనందమ్మ, ముద్దమ్మ తదితరులు నపాల్గొన్నారు.

ఉత్సవ కమిటీకి సన్మానం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో బొడ్రాళ్ల ఉత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు ఆలయ కమిటీ సభ్యులైన రాజవర్ధన్‌రెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ ఎల్లస్వామియాదవ్, విష్ణువర్ధన్ నాయుడు, పులేంధర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడును గ్రామస్తులు శుక్రవారం ఆలయం వద్ద పూలమాలు, శాలువాలతో సన్మానించారు.



అలంపూర్ తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ పతాకానికి వందనం సమర్పిస్తున్న అధికారులు, నాయకులు



రాజోళిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆవిర్భావ వేడుకలు



ధరూరులోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద...



వడ్డేపల్లి మండల పరిషత్ కార్యాలయం ముందు జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, అధికారులు

అమరుల త్యాగ ఫలం తెలంగాణ

అమరవీరుల త్యాగ ఫలితంగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అబ్రహం అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, ప్రధాన కూడళ్లలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

గద్వాల: స్థానిక బీఆర్ఎస్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బీఎస్ కేశవ్ జాతీయ జెండాను ఎగరవేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని చైర్మన్ జంబు రామన్‌గౌడ ఎగరవేశారు. స్థానిక డీకే బంగ్లాలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

అలంపూర్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జడ్జీ కమలాపురం కవిత, మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మనోరమ, తహసీల్దార్ సుభాష్ నాయుడు, ఎంపీపీ బేగం, ఎక్సైజ్ సీఐ హనుమనాయక్, ఏడీఏ సక్రియనాయక్, ఎస్ఐ మహేందర్, లైబ్రేరియన్ మాణిక్యమ్మ వారి వారి కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. గాంధీచౌక్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు వెంకట్రామయ్యశెట్టి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

గద్వాల న్యూటౌన్: మార్కెట్ యార్డు కార్యాలయంలో యార్డు చైర్మన్ శ్రీధర్‌గౌడ్, వ్యవసాయ, మత్స్య, ఉద్యాన, గ్రామీణాభివృద్ధి శాఖల కార్యాలయాల్లో ఆయా శాఖల జిల్లా అధికారులు గోవిందునాయక్, షకీలాభానో, అక్బర్ అలీ, ఉమాదేవీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు.

ధరూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, బీసీ బాలుర వసతి గృహం, పీహెచ్‌సీ, ఐకేపీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాఠశాలల్లో జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నజీమున్నీసా బేగం, జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ నరేష్,



గద్వాలలో జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ఎంపీడీఓ ఎండీ జబ్బార్, ఎంఈఓ సురేష్, వార్డెన్ నర్సింహులు, జీహెచ్‌ఎంలు ప్రతాప్‌రెడ్డి, నరేష్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని బూరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి, సర్పంచ్ బండ్ల జ్యోతి హాజరయ్యారు.

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ మాదుర్య, ఎర్రవల్లి పీఏసీఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు రంగారెడ్డి, పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హనుమంత్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ రజిత, ఇన్‌చార్జ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈఓ నరసింహులు జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉద్యమకారులను బీఎస్పీ నాయకులు శాంతినగర్‌లో ఘనంగా సన్మానించారు.

రాజోళి: ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ మరియమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుగుణమ్మ, ఎంపీడీఓ గోవిందురావు, తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మ అధికారులు పాల్గొన్నారు.

అయిజ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్‌కుమార్, సింగిల్‌విండో కార్యాయంలో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్న దేవన్న, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ నాగేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ వద్ద మెడికల్ ఆఫీసర్ విష్ణు, వ్యవసాయ కార్యాలయం వద్ద ఎంఏఓ శంకర్‌లాల్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఉండవెల్లి: మండలం కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రేఖ, ఏఈఓ రాజేష్, ఎస్ఐ బాల్‌రాజు, ఎంఈఓ శివప్రసాద్, ఎంపీపీ భీసమ్మ, ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, తహసీల్దార్ వీరభద్రప్ప వారి వారి కార్యాలయాల్లో జెండాలను ఎగురవేశారు.

గట్టు: ఎంపీపీ విజయ్‌కుమార్, తహసీల్దార్ జుబేర్ అహ్మద్, ఎస్ఐ పవన్‌కుమార్, సహకార సంఘం అధ్యక్షుడు క్యామ వెంకటేష్, సర్పంచ్ ధనలక్ష్మి, ఏఓ హనుమంతురెడ్డి, ఎంఈఓ కొండారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఓబులేష్, ప్రియదర్శిని, సురేష్ వారి వారి కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. బల్గెరలో జెడ్పీటీసీ బాసు శ్యామల, బోయలగూడెంలో వైస్ ఎంపీపీ సుమతి త్రివర్ణ పతాకం ఎగువ వేశారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను మండల పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, వ్యవసాయ కార్యాలయం పంచాయతీల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో



అలంపూర్‌లో సీఐ కార్యాలయం వద్ద జాతీయ పతకానికి వందనం చేస్తున్న ఎక్సైజ్ సీఐ



ధన్వాడలోని బీసీ బాలుర వసతి గృహం వద్ద..



అయిజలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు

ఎంపీపీ మనోరమ, జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీడీఓ మహమ్మద్ అజార్ మోహిద్దీన్, మండల వ్యవసాయాధికారి మహాలక్ష్మి, ఎస్ఐ వెంకటేష్, ఆర్ఐ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మల్దకల్: ఎంపీపీ రాజారెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, ఎస్ఐ శేఖర్, సర్పంచ్ యాకోబు, డాక్టర్ స్వరూపరాణి, ప్రిన్సిపాల్ రమేష్‌లింగం, ఇతర అధికారులు వారి కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వైస్‌ఎంపీపీ పెద్దవీరన్న, రైతుబంధు మండల అధ్యక్షుడు



అలంపూర్ డివిజన్ కార్యలయంలో జాతీయ జెండాను ఎగుర వేసిని ఏడీఏ సక్రియా నాయక్



కేటీదొడ్డి తహసీల్దార్ కార్యలయంలోని జాతీయ జెండాను ఎగురవేసిన తహసీల్దార్ సుందర్‌రాజు

మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గద్వాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ, ఎస్సీ, బీసీ, ఐసీడీఎస్, మైనార్టీ, కార్మిక శాఖ, సఖీ కేంద్రం, బాలరక్ష భవన్, బాలసదనం తదితర కార్యాలయాల ఎదుట జాతీయ జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, సబ్ రిజిష్టర్ కార్యాలయంలో ఆవరణలో సబ్ రిజిస్టార్ చంద్రశేఖర్‌రెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగువ వేశారు.



ఉండవెల్లిలో..



గద్వాల మార్కెట్ యార్డు వద్ద..



అలంపూర్ మున్సిపల్ కార్యాలయంలో జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ



బీచుపల్లిలోని పదో బెటాలియన్‌లో..



ఎర్రవల్లిలో పతాకావిష్కరణ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్



స్మృతివనంలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రాజారెడ్డి



అలంపూర్‌కోర్టులో జాతీయ పతకానికి వందనం చేస్తున్న జడ్జీ

తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

గద్వాల/గద్వాల రూరల్: సోనియా గాంధీ కృషి ద్వారానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ సర్కిల్, ఫిరంగి చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. అదే విధంగా సోనియాగాంధీ చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వీరబాబు, రఘునాయుడు, కిఫాయత్, పాష, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, సీపీఎం కార్యాలయ ఆవరణలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి వెంకటస్వామి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

మల్దకల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గాంధీచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శంకర్, నారాయణరెడ్డి, వీరబాబు, నల్లారెడ్డి, కర్ణాకర్, గౌస్, షేక్‌జమాల్, ఇలియాస్, రాజేంద్ర, వెంకటేష్, రఘు, రవినాయుడు, మజీద్, కోటేష్‌గౌడు, హాజీ, తిమ్మారెడ్డి, శ్రీధర్, గోపాల్, ఏసు, వెంకటేష్ పాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పచ్చర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంధ్యాబాబు, కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి, నల్లారెడ్డి, షేక్ జమీల్, మహబూబ్ పాష,



గద్వాలలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గౌస్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించారు. నాగరాజు, నయీం, రమేష్, మద్దిలేటి, బాల్‌రాజు, రామాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసింది కాంగ్రెస్ పార్టీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌నాయుడు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి అన్నారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రుక్మానందరెడ్డి, వెంకటేష్, జితేందర్, రాజీకుమార్, శ్రీను, కృష్ణకాంత్, జగన్, పులేందర్, సంధ్యబాబు తదితరులు ఉన్నారు.

చింతల్ క్యాంపును గ్రామ పంచాయతీగా చేయాలి

రాజోళి: మండలంలోని పెద్దతాండ్రపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చింతల్ క్యాంపును ప్రత్యేక పంచాయతీ చేయాలని గ్రామస్తులు తహసీల్దార్ జోషి శ్రీనివాస్‌శర్మకు, ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందచేశారు. ఎన్నో ఏళ్లుగా చింతల్ క్యాంపు పెద్ద తాండ్రపాడులో అంతర్భాగంగా ఉందని, కానీ నేటి వరకు సరైన అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. గ్రామంలో సరైన సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవని, గర్భిణులు, శిశువులకు ఆస్పత్రులకు, ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలన్నా, వృద్ధులు, దివ్యాంగులు పింఛన్లకు పెద్ద తాండ్రపాడుకే నడుచుకుంటూ వెళాల్సి వస్తుందని వాపోయారు. కార్యక్రమంలో బసవరాజు, శ్రీను,కృష్ణ, బీచుపల్లి,నాగరాజు, అంజి గ్రామస్తులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న గ్రామస్తులు

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోండి

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ స్టేట్ ఎడ్యుకేషనల్ కన్వీనర్ బంగి లక్ష్మన్న అన్నారు. వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్ బీజేపీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి గ్రామాల్లో అవగాహన కల్పించి, లబ్ధిదారుల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మోహన్‌యాదవ్, అయ్యరాజు, రమేష్, తేజ, సంజన్న, శేఖర్, పరశురాముడు, అంజిలు పాల్గొన్నారు.

మల్దకల్: బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ గద్వాల అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మల్దకల్‌లో బీజేపీ కార్యకర్తలు, నాయకులతో ఆపార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. నరేంద్రమోడీ 9 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, వెంకటేష్, గోవిందు, రాజశేఖర్, గోపాల్, గోపాల్‌రెడ్డి, లవన్న, దర్శెల్లి, గోవిందు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేపల్లిలో మాట్లాడుతున్న బంగి లక్ష్మణ్

ఆరు కాళ్లతో పొట్టేలు జననం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పాడి రైతు గోపాల్ పెంచుకుంటున్న గొర్రెకు మూడు రోజుల క్రితం ఆరు కాళ్లు, రెండు మూత్ర నాళాలు, రెండు మల ద్వారాలతో పొట్టేలు జన్మించినట్లు తెలిపారు. రైతు శుక్రవారం ఈ పొట్టేలును పశువైద్యశాలకు తీసుకురావడంతో సురక్షితంగానే ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు.



క్లుప్తంగా...

తెలంగాణను గుజరాత్‌ని పోల్చి చూద్దామా!

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: 'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని మీ నేత, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పోల్చి చూద్దామా'అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ సర్కార్లు అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ, గుజరాత్‌లో ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగాల కల్పనపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలలో కలిపి కూడా గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఇచ్చినన్ని ఉద్యోగాలు కల్పించ లేకపోయారని అన్నారు. సరైన ప్రత్యామ్నాయం లేకనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం ఉన్న చోట వేరే పార్టీలే విజయం సాధిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉనికి కోసమే బీజేపీ పడరానిపాట్లు పడుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ గురించి మాట్లాడే నైతికత కిషన్‌రెడ్డికి లేదన్నారు. బీజేపీ కుట్రలు రాష్ట్రంలో పనిచేయవని, మొత్తం తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉందని అన్నారు.

అరెస్టు చేశాం.. పోలీసు మార్జాలాలు ఉండవు

ఎలాన్ మస్క్ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసుల స్పందన



న్యూఢిల్లీ: ట్విట్టర్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌కు ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమాధానం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్‌ఫెక్ట్ రిప్లై ఇచ్చారంటూ పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. అసలేం జరిగిందంటే.. పోలీసు జాగిలాలు (కుక్కలు) ఉంటాయని మనకు తెలుసు, మరి పోలీసు మార్జాలాలు (పిల్లులు) కూడా ఉంటాయా? అని తన కుమారుడు లిటిల్ ఎక్స్ అడిగాడంటూ మస్క్ గురువారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసు శాఖ శుక్రవారం స్పందించింది. ''హాయ్ ఎలాన్ మస్క్! పోలీసు పిల్లులు ఉండవు. ఎందుకంటే నేరాలు ఘోరాలు చేసినందుకు వాటిని ఎప్పుడో అరెస్టు చేసేశాం. ఈ సంగతి మీ లిటిల్ ఎక్స్‌కు చెప్పండి''అని ట్వీట్ చేసింది. భలేగా స్పందించారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.





శుక్రవారం గుంటూరు చుట్టగుంట సెంటర్‌లో 2,562 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

ఇదిగో గ్రామ స్వరాజ్యం

ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం అని ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద రూ.361.29 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్ స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

దామరచర్ల @ 46.8!

నల్లగొండ జిల్లా దామరచర్లలో ఈ వేసవిలోనే అత్యధిక ఉష్ణోగ్రత

- రాష్ట్రవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు
- రెండ్రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు: వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వివిధ ప్రాంతాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికా విభాగం సేకరిస్తున్న గణాంకాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్లలో శుక్రవారం ఈ వేసవిలోనే అత్యధికంగా 46.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది, అలాగే పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు రానున్న రెండ్రోజులు గరిష్ట ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని, వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని పేర్కొంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
దామరచర్ల	నల్లగొండ	46.8
ముత్తారం	పెద్దపల్లి	46.4
తంగుల	కరీంనగర్	45.9
మునగాల	సూర్యాపేట	45.7
మహదేవ్‌పూర్	భూపాలపల్లి	45.6

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	42.3	25.4	ఖమ్మం	43.2	28.2
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	42.0	26.6
హకీంపేట	40.2	26.8	మెదక్	42.3	25.0
దుండిగల్	40.2	27.3	నల్లగొండ	43.0	23.4
హనుమకొండ	41.5	25.0	నిజామాబాద్	43.0	29.9
హైదరాబాద్	40.8	28.4	రామగుండం	42.0	25.6

తెలంగాణ వేడుకలతో సమతాభావం

ఉజ్జయినిలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్



వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మధ్యప్రదేశ్‌లో తెలంగాణ వేడుకల నిర్వహణ ఇరు రాష్ట్రాల పౌరుల మధ్య సమతాభావం పెంపునకు దోహదపడుతుందని మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ అన్నారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కీర్తి మందిర్ విక్రమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. 'ఏక్ భారత్–శ్రేష్ట భారత్'కార్యక్రమం కింద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ చరిత్రను తెలిపే లఘుచిత్రాన్ని ప్రదర్శించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పాటలు, జానపదాలను దాదాపు 1200 మంది కళాకారులు ఉత్సాహంగా ప్రదర్శించారు. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసి నరహరి మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.

హస్తినలో ఘనంగా 'తెలంగాణ దశాబ్ది వేడుకలు'

21 రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. మరో ప్రత్యేక ప్రతినిధి కె.ఎం. సాహ్ని, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్ జాజులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని ఫ్రాన్స్ ఎంబసీ ప్రతినిధి లారెంట్ ట్రిపోనే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ 21రోజుల పాటూ ఘనంగా నిర్వహించనున్నట్లు మంద జగన్నాథం తెలిపారు. అనంతరం అతిథులందరూ కలిసి భవన్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రగతిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అదే విధంగా హెల్త్ క్యాంపును, వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా ప్రారంభించారు.

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు..

తెలంగాణ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆపై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' కసరత్తు

ఎన్నికల నిర్వహణపై ఈనెల 13న కార్మిక సంఘాలతో సమావేశం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యంతో పాటు సంస్థలో రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించనుంది. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో మొత్తం 24 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు సింగరేణిలో విస్తరించి ఉన్నాయి. ఇందులో మొత్తం 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

నాలుగేళ్లు పూర్తయినా..

చివరిసారిగా 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) గెలుపొందింది. దీని కాలపరిమితి 2021 అక్టోబర్‌తో ముగిసింది. అయితే కరోనా కారణంగా అప్పుడు ఎన్నికల గురించి ఆలోచన చేయలేదు. దీంతో 2022 నవంబర్‌లో ఏఐటీయూసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని డిసెంబర్ చివరి వారంలో సింగరేణిని ఆదేశించింది. అయితే సింగరేణి లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జూన్ 1 నుంచి ఆగస్టు 31లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చి 29న తుది ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(హైదరాబాద్) ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈనెల 13న కార్మిక సంఘాలు, యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశం అనంతరం ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందని కార్మిక సంఘాల నేతలు చెపుతున్నారు.

ట్రాక్టర్ లాగిన రిటైర్డ్ ఆర్మీ జవాన్



ట్రాక్టర్ లాగుతున్న గోపాల్‌యాదవ్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు గోపాల్‌యాదవ్ ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహించి రెండు నెలల క్రితం రిటైర్డ్ అయ్యారు. ఆయన కుటుంబంతో కలిసి గ్రామంలో నివసిస్తూ వ్యాపారం చేస్తున్నాడు. శుక్రవారం గ్రామంలో ఉన్న స్నేహితులతో కలిసి ఆర్మీలో చేసిన సాహసాల గురించి ముచ్చటించారు. అనంతరం అతడు బుజాలకు తాడు కట్టుకొని ట్రాక్టర్ ట్రాలితో సహ 60 ఫీట్లు సునాయాసంగా లాగారు. కాగా ఈ వీడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టింది.

ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

బాలానగర్: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకులం కళాశాలలో సీఓఈ, కల్వకుర్తి ఏకలవ్య గురుకుల ఆదర్శ గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో మిగిలిన మొదటి సంవత్సరం సీట్ల అడ్మిషన్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు బాలానగర్ ఏకలవ్య ఆదర్శ గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పొందేందుకు గిరిజన విద్యార్థులు మాత్రమే అర్హులుగా ఆయన పేర్కొన్నారు. 2023–24 మొదటి సంవత్సరం ఇంటర్ ప్రవేశాలకు 2022–23లో పదో తరగతి పూర్తి చేసి ఉత్తీర్ణులై ఉండాలని, జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారని, అర్హులైన విద్యార్థులు కులం, ఆదాయం, ఫొటో, మెమోలతో ఆయా కళాశాలల్లో శనివారం 10 గంటలకు హాజరుకావాలని ఆర్సీఓ నాగార్జునరావు ప్రకటన విడుదల చేశారని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

నిండుగా రామన్‌పాడు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం 1,021అడుగుల వరకు పూర్తిస్థాయి నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ నీటిని ఆపారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

400 ఏళ్ల కత్వా.. జనంతో సందడి

జటప్రోల్ సంస్థానాధీశులు, సురభి వంశస్తులు 400ఏళ్ల క్రితం రాకపోకల కోసం నిర్మించుకున్న వంతెన ఇప్పుడు పర్యాటకులకు ఎంతో ఆహ్లాదకరంగా మారింది. చిన్నకత్వా వాటర్‌పాల్స్ రూపంలో కనిపించడంతో చాలా మంది కుటుంబ సభ్యులు వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు సేద తీరుతున్నారు. చుట్టు పక్కల పంటపొలాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. సింగోటం శ్రీవారి సముద్రం నుంచి దిగువకు వాగు ద్వారా రామాపురం, పెంట్లవెల్లి మీదుగా జటప్రోల్ సమీపంలో ఈ కత్వకు వస్తుంటాయి. చుట్టు పక్కల పలు ప్రాంతాల నుంచి చాలా మంది కత్వా వద్ద గడిపేందుకు వస్తుండడంతో సందడిగా మారుతుంది. కత్వ వద్దకు వెళ్లేందుకు దారి ఇబ్బందిగా ఉండడంతో కాస్త మరమ్మతు చేయించి, తాగునీటి వసతి కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు. – పెంట్లవెల్లి



కత్వా వద్ద పర్యాటకుల కిటకిట



యువకుల సందడి



సేద తీరుతున్న పర్యాటకులు

'ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు నమ్మరు'



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 9 ఏళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అద్భుత ఘట్టాలను సాధించుకున్నామన్నారు. నియోజకవర్గానికి లిఫ్ట్ ఇరిగేషన్ రావడం మరుపురానిదన్నారు. ప్రాజెక్టులను ఆపడానికి ప్రతి పక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఈనెల 6న జిల్లాకు సీఎం కేసీఆర్ రానున్నారని, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు.

యల్లసన్‌పల్లిలో కేంద్ర బృందం పర్యటన



యల్లసన్‌పల్లిలో చెరువును పరిశీలిస్తున్న కేంద్ర బృందం

మద్దూర్: మండలంలోని యల్లసన్‌పల్లిలో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ పల్లవ్‌కుమార్ చటర్జీ, డీఆర్‌డీఓ గోపాల్ నాయక్ గ్రామంలోని నర్సోనిపల్లి చెరువును పరిశీలించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో అమృత్ సరోవర్ పథకం ద్వారా చేపట్టిన చెరువు అభివృద్ధి పనులను చూశారు. అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్టేట్ క్వాలిటీ కంట్రోల్ అధికారి మహేష్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి చంద్రశేఖర్, స్టేట్ టెక్నికల్ ఎక్స్‌పర్ట్ అబేద్‌ఖాన్, సర్పంచ్ దేవిక, ఎంపీడీఓ శశికళ, ఏపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

బంగారం, బైక్ రికవరీ



మహబూబ్‌నగర్ క్రైం: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ లక్ష్మణ్, టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. న్యూగంజ్‌కు చెందిన బోయ విజయ్, కోయనగర్‌కు చెందిన పరశురాములు, న్యూమోతీనగర్‌కు చెందిన సురేష్ అలియాస్ చింటు, దొడ్డలోనిపల్లికి చెందిన కొమ్ము సాయికుమార్ ముఠాగా ఏర్పాడి జల్సాల కోసం తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఈనెల 27న న్యూగంజ్‌కు చెందిన బలరాం ఇంట్లో 8తులాల బంగారం అపహరించారు. దొంగతనం చేసిన ఆభరణాలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని బంగారు బాలప్ప దుకాణంలో విక్రయించడానికి ప్రయత్నిస్తుంటే అదుపులోకి తీసుకుని విచారించినట్లు వెల్లడించారు. వీరి నుంచి 7.2 తులాల బంగారం, వెండి లాకెట్, రూ.700 నగదు, బైక్ రికవరీ చేసినట్లు తెలిపారు. నలుగురిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీసీఎస్ సీఐ ఇఫ్తాకర్ అహ్మద్, సీఐ రాజేందర్, ఎస్‌ఐలు రవి ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాల్లో దశాబ్ది ఉత్సవాలు



జోగుళాంబ ఆలయంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈఓ, పాలకమండలి సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం : రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం అలంపూర్ జోగుళాంబ ఆలయంలో దశాబ్ది ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ అర్చకులు సీఎం కేసీఆర్ గోత్ర నామాలు ఉచ్చరిస్తూ లోక కల్యాణార్థం మహా సంకల్పాన్ని పఠించారు. ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ కృష్ణయ్య జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈఓ మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దు అలంపూర్ ప్రాంతం నుంచి ప్రారంభం కావడం, రాష్ట్రంలో ఏకైక శక్తిపీఠం కావడంతో ప్ర భుత్వం దశాబ్ది ఉత్సవాల విజయవంతానికి జోగుళాంబ ఆశీస్సులు కోరుతూ ఇక్కడి నుంచి ప్రారంభించిందన్నారు. అదేవిధంగా అభిషేకాలు, చండీహోమాలను చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అర్చకుడు ఆనంద్ శర్మ, పాలక మండలి సభ్యులు ఉన్నారు.

మన్యంకొండలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర దశాబ్ది వేడుకలను పురస్కరించుకుని మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని విద్యుత్ దీపాలంకరణలో సుందరంగా ముస్తాబు చేశారు. రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో మన్యంకొండ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

దశాబ్ద తెలంగాణలో ముస్లింలకు ఒరిగిందేమిటి?



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దశాబ్ద తెలంగాణ రాష్ట్రంలో ముస్లింలకు ఒరిగిందేమిటని ప్రజాసంఘాల ఐక్యకార్యచరణ కమిటీ ప్రతినిధులు ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 'ప్రతి కంట నీరు–ప్రతి ఇంట చీకటి ఇది ముస్లింల గోస' కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయినప్పటికీ ముస్లింల ఆర్థిక, రాజకీయ, సామాజిక జీవన విధానంలో ఎలాంటి మార్పురాలేదన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, వారి జీవితాల్లో మార్పులు తెస్తామని చేసిన వాగ్దానం అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని బలహీన వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించిన ప్రభుత్వం ముస్లింలకు మాత్రం నిర్మించలేదన్నారు. రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికారభాషగా అమలు చేయాలని, మైనార్టీల్లో ప్రతి కుటుంబానికి ఉపాధి కోసం రూ.5లక్షలను పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని, ఉర్దూ మీడియం పాఠశాలలు ఏర్పాటు చేయాలని, అన్ని సబ్జెక్టు ఉర్దూ మీడియం ఉండాలని, మైనార్టీ రిజర్వేషన్‌ను చట్టబద్ధం చేయాలని, దామాషా ప్రకారం విద్యా, ఉద్యోగాలతోపాటు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో షాదీఖానా, ఆత్మగౌరవ భవనం ఏర్పాటు చేయాలని, మైనార్టీలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ముస్లింల జనాభా ప్రాతిపదికన డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని, వక్ఫ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. త్వరలో రాజకీయ పార్టీలను కలిసి డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని పంపిణీ చేసి తాము చేసే పోరాటానికి మద్దతు కోరుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం.ఖలీల్, కాంగ్రెస్ మైనార్టీసెల్ కార్యదర్శి సాధిక్, ఇష్రత్‌అలీ, మహ్మద్ అయూబ్, వహీద్‌షా, ఖాజాజైనుల్లా అబెదిన్, యూసుఫ్ బిన్ నాసర్, ముఖ్తార్ అహ్మద్, విజయ్, జలాలుద్దీన్ భాషా పాల్గొన్నారు.